ఇన్‌స్పైర్‌పై అనాసక్తి

దరఖాస్తులకు స్పందన అంతంతమాత్రమే
- ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు 695
- గతేడాదితో పోలిస్తే తక్కువే..
- 30వ తేదీ వరకు గడువు పొడిగింపు



ఇన్‌స్పైర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

మెదక్‌జోన్: విద్యార్థులను రేపటి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్రప్రభుత్వం మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని శాస్త్ర, సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతియేటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ (ప్రేరణ) పోటీలకు పెద్దగా ఆసక్తి చూపటంలేదు. 6వ, తరగతి నుంచి ఇంటర్ మీడియెట్ వరకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఇందుకోసం విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావటం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 6 నుంచి ఇంటర్ వరకు 240 పాఠశాలలు ఉండగా ఒక్కో పాఠశాల నుంచి ఐదు ఎగ్జిబిట్లను దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 1,200 ఎగ్జిబిట్లు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 695 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇంకా 505 మంది విద్యార్థు లకు అవకాశం ఉంది. కాగా జూన్ 15వ, తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. ఆశించిన మేర దరఖాస్తులు రాకపోవటంతో సెప్టెంబర్ 30వ, తేదీ వరకు గడువు పొడిగించారు.

ఇప్పటికే అవగాహన

ఇన్‌స్పైర్‌కు సంబంధించి జూన్ మొదటి వారంలోనే విద్యార్థులకు శాస్త్రవేత్తల వైపు మళ్లించాలని, అందు కోసం వారితో వివిధ రకాల ఎగ్జిబిట్లను తయారు చేయించాలని సైన్స్ టీచర్లకు అవగాహన కల్పించారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు చేసుకోవటంలేదు.

గతేడాది 54 ఎగ్జిబిట్లు ఎంపిక

గత సంవత్సరం ఇన్‌స్పైర్ (ప్రేరణ)కు సంబంధించి ఆన్‌లైన్‌లో 675 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆ ఎగ్జిబిట్లను నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు క్షుణ్ణంగా పరిశీలించి వాటిలో 54 ఎగ్జిబిట్లను ఎంపిక చేశారు. వాటికి ఒక్కో ఎగ్జిబిట్‌కు రూ.10 వేల చొప్పున మొత్తం రూ 5.40 లక్షలను నేరుగా విద్యార్థుల ఖాతాలో వేస్తారు. ఎగ్జిబిట్ పరికరాల కోసం రూ 5 వేలు, రవాణా ఖర్చులకు రూ 5 వేల చొప్పున రూ 10వేలను వేయనున్నారు. కాగా గతేడాది ఎంపికైన 54 ఎగ్జిబిట్లను నవంబరు మొదటి వారంలో ప్రదర్శన నిర్వహించనున్నారు. వాటిలో 10 శాతం బెస్టు ఎగ్జిబిట్లను సెలక్షన్ చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. అక్కడ సైతం 10శాతం బెస్టు వాటిని సెలక్షన్ చేసి జాతీయస్థాయికి పంపుతారు. జాతీయస్థాయిలో దేశం మొత్తం 60 బెస్టు ఎగ్జిబిట్లను ఎంపిక చేసి రాష్ట్రపతి భవన్‌కు పంపిస్తారు. ఆ ప్రాజెక్టుకు పేటెంట్ (పూర్తి) హక్కు వాటిని తయారు చేసిన విద్యార్థులకు మాత్రమే ఉంటుంది. వాటిని పెద్ద పెద్ద కంపెనీవారు అడాప్ట్ చేసుకుని వాటిని తయారు చేసిన విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసి వాటిని మానవాళికి ఉపయోగించే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎగ్జిబిట్లలో బెస్టు ఎగ్జిబిట్లను ఎంపిక చేసి వచ్చే ఏడాదిలో ప్రదర్శిస్తారు.

చక్కటి అవకాశం



విద్యార్థులను రేపటి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇది చక్కటి అవకాశం. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులతో పాటు గైడ్‌టీచర్లు ప్రోత్సహించాలి. ఈ నెల 30వరకు అవకాశం ఉంది.

– రాజిరెడ్డి జిల్లా సైన్స్ అధికారి

క్లుప్తంగా

శివ్వంపేటలో కుండపోత

రాకపోకలకు తీవ్ర అంతరాయం



గోమారం-నవాబుపేట రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మండలంలో బుధవారం రాత్రి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గోమారం-నవాబుపేట ప్రధాన రహదారి కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. మండలంలో 78.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పీహెచ్‌సీలో వైద్య శిబిరం



శివ్వంపేటలో వైద్య శిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పేద. మధ్య తరగతి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రముఖ వైద్యులచే శిబిరం నిర్వహించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు కవితారెడ్డి అన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యురాలు సాయిసౌమ్య, బీజేపీ నాయకులు రవి, కొండల్‌రావు, పన్నారెడ్డి, అశోక్, రాములు, వినోద్, తదితరులు ఉన్నారు.

తెలంగాణ జాగృతిలో చేరిక



జాగృతిలో చేరిన లావణ్యగౌడ్, తదితరులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణానికి చెందిన తుజాల లావణ్యగౌడ్, మరి కొందరు కార్యకర్తలతో కలిసి గురువారం తెలంగాణా జాగృతిలో చేరారు. ఈ మేరకు ఆమె జాగృతి అధ్యక్షురాలు కవిత వారికి కండువా కప్పి ఆహ్వానించారు. జాగృతి పటిష్టత కోసం కృషి చేయాలని సూచించారు. సీనియర్ నాయకురాలు శైలజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



గోవిజ్ఞాన పరీక్షల కోసం పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): గోవిజ్ఞాన పరీక్ష నిర్వహించేందుకు కళాశాల, పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రశ్నపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. గురువారం గోవిజ్ఞాన జిల్లా ప్రముఖ్ ప్రభాకర్‌రెడ్డి, సహ ప్రముఖ్ రాజేందర్ మండలంలోని కౌడిపల్లి, వెల్మకన్న, కంచన్‌పల్లి ఉన్నత పాఠశాలతోపాటు కౌడిపల్లి జూనియర్ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రశ్నపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. మండల, జిల్లా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి బహుమతులు అందచేయనున్నట్లు చెప్పారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



యూరియా కోసం క్యూలో రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): యూరియా కోసం రైతుల ఇబ్బందులు తప్పడం లేదు. గురువారం ప్రాథమిక సహకార సంఘం వద్ద ఉదయం నుంచి రైతులు యూరియా కోసం బారులు తీరారు. మధ్యాహ్నం అనంతరం 500 బస్తాల యూరియా రావడంతో రైతులకు పంపిణీ చేశారు.

ఇన్‌స్పెక్టర్ బదిలీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ బదిలీ అయ్యారు. రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న గణేష్ కొల్లూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

గుంతలతో వాహనదారుల ఇక్కట్లు



నర్సాపూర్ చౌరస్తాలో సంగారెడ్డి రోడ్డుపై గుంతలు



తూప్రాన్ వైపు వెళ్లే రోడ్డు దుస్థితి

నర్సాపూర్: జాతీయ రహదారిపై ఉన్న చౌరస్తాలో ఏర్పడిన గుంతలను సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. చాలా నెలలుగా చౌరస్తాలో గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేయడంతో కొన్ని రోజులకే గుంతలు యథాతథంగా ఏర్పడుతున్నాయి. స్థానిక చౌరస్తాలో సంగారెడ్డి నుంచి వచ్చే రోడ్డుతో పాటు తూప్రాన్ వెళ్లే రోడ్డుతో పాటు అటు వైపు నుంచి వచ్చె రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వర్షాలు ఎక్కువగా కురువడంతో గుంతలలో నీళ్లు నిలువడంతో అవి ఎంత లోతు ఉన్నాయె తెలియక వాటిపై నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా నెలలుగా ఇబ్బందులకు గురి చేస్తున్న గుంతలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

హెచ్‌ఐవీ, టీబీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్కోప్ లింక్ వర్కర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు హెచ్‌ఐవీ, టీబీపై స్కోప్ లింక్ వర్కర్ అనుష అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ప్రేమ, ఆకర్షణలకు లోనుకాకుండా శ్రద్ధగా చదువుకోవాలని చెప్పారు. హెచ్‌ఐవీ, టీబీ వ్యాధులు ప్రమాదకరమని జాగ్రత్తగా ఉండాలన్నారు. అక్రమ సంబంధాలు, రక్తమార్పిడి, కలుషిత సూదులు సిరంజిల వల్ల హెచ్‌ఐవీ ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్నారు. టీబీ ఒకరి నుంచి ఒకరికి సోకే ప్రమాదం ఉందన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడటంతో హెచ్‌ఐవీ అదుపులో ఉంటుందని, టీబీ తగ్గుతుందని చెప్పారు.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

సీఐటీయూ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పంచాయతీ కార్మికులతో కలిసి శివ్వంపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడం వల్ల దసరా పండుగకు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కింది స్థాయి సిబ్బందికి నెలవారీగా వేతనాలు ఇవ్వని పరిస్థితిలో ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రెండు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ప్రజా సమస్యల పై ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం**

వెల్దుర్తి(తూప్రాన్): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని కాంగ్రెస్ పార్టీ నేత నరేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రం వెల్దుర్తిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. యూరియాపై ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ యూరియా కొరత ఉందని, వాటితో పోలిస్తే తెలంగాణలో సరఫరా మెరుగ్గా ఉందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

◆ **దళితుల అభివృద్ధి పట్టదా..?**

కొల్చారం(నర్సాపూర్): దళితుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి పనిచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా యువసేన నాయకుడు మహేష్ కోరారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ అభయ హస్తం కింద దళితులకు ఇస్తామన్న రూ.12 లక్షలు ఇప్పటికి ఇవ్వలేదన్నారు. రాజీవ్ యువ వికాసం పేరిట దరఖాస్తులు తీసుకోవడం తప్పించి ఏ ఒక్కరికి లబ్ధి చేకూర్చింది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి అవసరమైన సహకారం అందిస్తామని చెప్పినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు.

◆ **నీరు సరఫరా చేయాలని వినతి**

జహీరాబాద్ టౌన్: హోతి(కె)వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు నీటి సరఫరా చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు మున్సిపల్ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జహీరాబాద్ నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారన్నారు. ఇళ్లకు నీటి సరఫరా లేదని, డ్రైనేజీ, కరెంట్ సమస్య కూడా ఉందన్నారు. దసరా పండుగ సందర్భంగా గృహ ప్రవేశాలు చేస్తున్న వారు నీటి సమస్య వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పండుగను దృష్టిలో పెట్టుకుని నీటి సరఫరాతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు చేపట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం కౌడిపల్లిలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వరకు అన్ని గ్రామాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు మురికి కాలువలు శుభ్రం చేయడం, చెత్త తొలగింపు తదితర పారిశుద్ధ్యం పనులు చేయాలన్నారు. పెంటకుప్పలు తొలగించాలని చెప్పారు. వన మహోత్సవంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, ఏపీఓ పుణ్యదాస్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన చెత్త సేకరణ

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికులు గురువారం నుండి విధులు బహిష్కరించి సమ్మెకు దిగడంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. ప్రభుత్వం కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తు ఆందోళన బాట పట్టారు. నిత్యం చెత్త సేకరణ తో పరిశుభ్రంగా ఉన్న గ్రామాలు కార్మికుల సమ్మె తో అపరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించి నిత్యం చెత్త సేకరణ జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు చెందిన న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. న్యాయవాదుల సంరక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలన్న డిమాండుతో బార్ సభ్యులందరు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. కాగా ఈనెల 17న నిరవధిక సమ్మె చేస్తున్న సంగారెడ్డి బార్ అధ్యక్షుడిని అరెస్టు చేయడాన్ని తమ అసోసియేషన్ తీవ్రంగా ఖండించిందని ఆయన వివరించారు.

వాగులో కొట్టుకుపోయిన గేదె మృతి

టేక్మాల్(మెదక్): గుండువాగులో కొట్టుకుపోయి గేదె మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్‌కి చెందిన తంప్లూర్ కేశవులు వ్యవసాయంతో పాటు గేదెను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే నిత్యం మాదిరిగానే ఈనెల 17న మేత మేపేందుకు పొలం వద్దకు తీసుకెళ్లగా.. మేత మేస్తూ గుండువాగులోకి జారిపడింది. వాగులో కొట్టుకుపోయిన గేదె గురువారం మండలంలోని ఎలకుర్తి శివారులో తేలింది. గేదె సుమారుగా రూ.90వేల విలువ ఉంటుందని తెలిపారు. ఈ మేరకు బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

నేటి నుంచి మహిళలకు వైద్యపరీక్షలు

మండల వైద్యాధికారి శ్రీకాంత్



ఆశా వర్కర్లతో సమావేశమైన వైద్యాధికారి శ్రీకాంత్

కౌడిపల్లి(నర్సాపూర్): ఎస్‌ఎన్‌ఎస్‌పీఏ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కౌడిపల్లిలో పీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక వైద్య చికిత్సలు చేయనున్నట్లు మండల వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. గురువారం కౌడిపల్లి పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎన్‌ఎస్‌పీఏ (స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్) కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ డాక్టర్ల చేత మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 19న గైనిక్, 22న ఈఎన్‌టీ, 23న ఆర్థోపెడిక్, 24న జనరల్ మెడిసిన్, 26న డెంటల్, 30 డర్మటాలజీ వైద్యులు ప్రత్యేక చికిత్సలు చేస్తారని చెప్పారు. గ్రామాలలోని ఆయా సమస్యలు ఉన్న మహిళలను గుర్తించి పీహెచ్‌సీకి వచ్చి చికిత్సలు చేసుకునే విధంగా ఆశ వర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫెర్జాజ్, సీహెచ్‌ఓ ఎలిజబెత్‌రాణి, హెచ్‌ఈఓ షకీల్, సూపర్‌వైజర్ రమేష్ వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- గుండువాగుపై తేలిన ఇనుప చువ్వలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వంతెనపై తేలిన ఇనుప చువ్వలు

టేక్మాల్(మెదక్): జోగిపేట– టేక్మాల్ ప్రధాన రహదారిపై ఉన్న గుండువాగుపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా రోడ్డు కూలిపోవడంతో పాటు, వంతెనపై తారు కొట్టుకుపోయి ఇనుప చువ్వలు తేలాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెన పైనుంచి తరచుగా వరద నీరు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనకు ఇరువైపులా రోడ్డు సైడ్ బార్మ్ కోసుకుపోతుంది. వంతెనపై ఉన్న తారు కొట్టుకుపోవడంతో గుంతలు ఏర్పడి రాళ్లు, ఇనుప చువ్వలు తేలి రోడ్డు కుంగిపోతుంది. ద్విచక్ర వాహనాదారులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాలు వస్తే ఎప్పుడూ కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే సైతం ప్రమాదం చోటుచేసుకుంటుందని వాపోతున్నారు. రాత్రి వేళల్లో వాహనాలకు ఇనుప చువ్వలు గుచ్చుకొని పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వెంటనే ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గురుకుల ఉపాధ్యాయుల నిరసన



మైనారిటీ గురుకులం ఎదుట నిరసన చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు

నర్సాపూర్: తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సాపూర్‌లోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు గురువారం విద్యా సంస్థ ఎదుట నిరసన తెలిపారు. తమ వేతనాలు సగం తగ్గించారని, మూడు నెలలుగా ఏజెన్సీ వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కాగా ప్రభుత్వం తాజాగా 1437 నంబరు జీవో తేవడంతో తమ వేతనాలు సగానికి తగ్గాయనిచ వెంటనే ఆ జీఓను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఉపాధ్యాయులు లెక్చరర్లు ప్లకార్డులతో విద్యా సంస్థ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ నసీమా షేక్‌కు వినతిపత్రం అందచేశారు.

మహిళలు, పిల్లల భద్రతకు కృషి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సుభవల్లి

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని సఖి, భరోసా సెంటర్లు మహిళలు, పిల్లల భద్రతకు ఎంతో కృషి చేస్తున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సుభవల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి, భరోసా సెంటర్లను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సూచనల మేరకు కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, లాడ్స్ డిప్యూటీ చీఫ్ రామశర్మ, ప్యానల్ అడ్వకేట్ కరుణాకర్, సఖీ సెంటర్ ఓస్సీ రేణుక, లీగల్ కౌన్సిలర్ నిర్మల, శ్వేత, సబ్ ఇన్‌స్పెక్టర్ సుచిత తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



సీఎం రేవంత్‌రెడ్డితో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి

నర్సాపూర్: జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపడంతో పాటు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. గురువారం సీఎంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జోన్‌లో ఉండడంతో నిరుద్యోగులు నష్టపోతున్నారని వివరించారు. అంతారం గ్రామాన్ని కౌడిపల్లి మండలంలో కలపాలని, నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. కాగా నియోజకవర్గ పరిధిలో పలు రోడ్ల విస్తరణకు రూ. 171 కోట్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. తన అభ్యర్థనపై సీఎం సానుకూలంగా స్పందించారని, నియోజకవర్గ అభివృద్ధికి తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని రాజిరెడ్డి తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



చెత్తను తొలగిస్తున్న నాయకులు

నర్సాపూర్: ప్రధాని పుట్టిన రోజు నుంచి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ తెలిపారు. గురువారం పట్టణంలో పలు చోట్ల స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపట్టి మాట్లాడారు. వచ్చే నెల 2వ తేదీ వరకు సేవా పక్షం ఉంటుందని, ప్రతి రోజు ఒక రకమైన సేవా కార్యక్రమం చేపడుతామని వారు వివరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, కవిత, పెద్దరమేష్‌గౌడ్, నగేష్, ఆంజనేయులుగౌడ్, చంద్రయ్య, యాదగిరి, రమేష్ యాదవ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.